ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025
5
విజయనగరం

జాతీయ తైక్వాండో పోటీలకు ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23 నుండి 25 వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్ లో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 10,11 తేదీ అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికై మన రాష్ట్రం తరపున పాల్గొంటున్నారు. ఎంపికైన క్రీడాకారులు హర్షిని, తరుణ్, రోహిణి సత్య , బి హర్షవర్ధన్, వైష్ణవి దేవి , షణ్ముఖ సిద్ధార్ధలకు త్త్వైక్వాండో అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, కోచ్ యశస్విని అభినందించారు.

గిరిజనులపై ఎందుకీ వివక్ష?

- పురిపాకకూ నోచని బట్టివలస పాఠశాల
- భవనం లేక చర్చిలో తరగతులు
- రోడ్డు, మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రతి గ్రామంలోనూ బడి పెట్టి ఉచిత విద్యను అందించాల్సిన పాలకులు గిరిజనుల పట్ల వివక్షత చూపుతున్నారు. బొబ్బిలి మండలం గోపాల రాయుడుపేట పంచాయతీ బట్టివలస గిరిజన గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడంతో ఉపాధ్యాయులు చర్చిలో తరగతులు నిర్వహిస్తున్నారు. గిరిజనుల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి ఈ ఘటన నిలువుటద్దంగా నిలుస్తోంది.

బట్టివలసలో 1,2 తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి డెప్యుటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయుడిని నియమించింది. కానీ గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడంతో గిరిజనులు సొంత నిధులతో పాఠశాల కోసం పాకను ఏర్పాటు చేశారు. వర్షాలు, గాలులకు పాక కూడా పూర్తిగా పాడైపోవడంతో గ్రామంలో ఉన్న చర్చిలోనే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. 1,2 తరగతులు గ్రామంలో నిర్వహిస్తున్నప్పటికీ 3,5,6,7,8 తరగతులు చదివేందుకు నడుచుకుంటూ గోపాలరాయుడుపేట వెళ్లాల్సి ఉంది. వర్షం కురిస్తే బురద రోడ్డులో వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తుందని గిరిజన విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

వర్షాలు, గాలులకు పాడైపోయిన గిరిజనులు నిర్మించుకున్న పాఠశాల (పాక)

రోడ్డు, మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు

బట్టివలసలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బట్టివలస వెళ్లాలంటే పొలం గట్లపై నుంచి వెళ్లాలి. బొబ్బిలి-మక్కువ రోడ్డు నుంచి బట్టివలస వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. పొలం, విఆర్ఎస్ కాలువ గట్టుపై నుంచి ఉన్న రోడ్డు వర్షం కురిస్తే బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు లేకపోవడంతో అంబులెన్స్ కూడా గ్రామానికి వచ్చే పరిస్థితి లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందు నిల్వ ఉంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆరోగ్యం క్షీణిస్తే డోలీమోతే..

గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం క్షీణిస్తే డోలీమోతతో గోపాలరాయుడుపేట రోడ్డు వరకు తీసుకుని వెళ్లి అక్కడ నుంచి ఆటో సహాయంతో బొబ్బిలి ఆసుపత్రికి వెళు తున్నామని గిరిజనుడు ఎం.రాజు చెప్పారు. గ్రామానికి పాఠశాల భవనం, సరైన రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం నిర్మించి, రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాల లేకపోవడంతో చర్చిలో చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు

విద్యార్థులు పాఠశాలకు వెళ్లే రహదారి ఇదే..

ఐక్యంగా తాటిపూడి నీటిని రక్షించుకోవాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-గంట్యాడ

వివిధ రూపాలలో అక్రమంగా తరలిస్తున్న తాటిపూడి నీటిని రక్షించుకోవడానికి తాటిపూడి ఆయకట్టు రైతులందరూ ఐక్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం తాటిపూడి రిజర్వాయర్ వద్ద తాటిపూడి ఆయకట్టు పరిరక్షణ కమిటీ, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాయవరపు సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం ప్రజల తాగునీటికి, జిందాల్ కంపెనీకి అక్రమంగా నీటిని తరలిస్తున్నారని, 14వ జీవోను తీసుకువచ్చి ఇటీవల అల్యూమినియం కంపెనీకి నీరు తరలించడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.. సాగునీటి అవసరాలను పక్కన పెట్టి ఇతర అవసరాలకు నీటిని తరలిస్తే రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అల్లు జోగినాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కాకముందు 45 వేల ఎకరాలకు సాగునీరు వెళ్లేదని, నేడు 15వేల ఎకరాలకే నీరు ఇస్తున్నారని అన్నారు. ఇతరత్రా కంపెనీలకు నీటిని అమ్ముకోవడంతో సాగునీరు అందడం లేదని అన్నారు. సుజల స్రవంతి నుంచి నీరు వస్తుందా రాదా అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు ఈ విషయాన్ని మంత్రి శాసనసభ్యుల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన జీవో 14ను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించామన్నారు. పోలవరం నుండి జిందాల్‌కు నీరు తరలించడానికి కృషి చేస్తామని మాట ఇచ్చారని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ పైపులైన్లు, పోలవరం కాలువ, గ్రీన్ ఫీల్డ్, రైల్వేలైన్ నిర్మాణాలకు పేదల భూములను లాక్కొంటున్నారని అన్నారు. 2012లో విశాఖపట్నం తాగునీటి అవసరాలకు అని చెప్పి నీటిని తీసుకెళ్లి రూ.26కోట్లకు అమ్ముకున్నారని, ఇప్పుడు రూ.40కోట్లకు అమ్ముకుంటున్నారని అన్నారు. తాటిపూడి ఆయకట్టు పరిధిలో ఉన్న రోడ్లు, కాలువలు కల్వర్టులు నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో జామి మండల నాయకులు పెదబాబు, రైతు సంఘం నాయకులు చల్లా జగన్, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ

ప్రయివేటు లేఅవుట్‌లో రైతుల ఆందోళన

- నమ్మించి మోసం చేసిన లేఅవుట్ యజమాని
- అప్పులు తీర్చలేక ఇప్పటికే ఇద్దరు రైతులు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలం లోని మోదవలస పరిధిలోని ఓ ప్రైవేటు లే అవుట్‌లో ఆ గ్రామ సర్పంచ్ ప్రతినిధి కనకల రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలోని శుభ గృహ ప్రైవేట్ లిమిటెడ్ అనే లేఅవుట్ యాజమాన్యం 11 ఎకరాల భూముల్లో 2017లో లేఅవుట్ వేసిందన్నారు. అందులో తమకు చెందిన నాలుగు ఎకరాలు భూమికి యజమాని ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదని, దీనిపై ఇప్పటికే జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశామని చెప్పారు. రైతులకు గత 8 సంవత్సరాల నుంచి డబ్బులు ఇవ్వకుండా లేఅవుట్ యజమాని గుంటూరు జిల్లా పెదపాడు నియోజకవర్గ వైసిపి మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకర్రావు కుమారుడు నంబూరి కళ్యాణ చక్రవర్తి తిప్పుతున్నాడన్నారు. గ్రామ సర్పంచ్ ప్రతినిధి కనకల రామారావు ఆధ్వర్యంలో ఈ భూములను అమ్మామని, లేఅవుట్ మధ్యలో తమ నాలుగు ఎకరాల భూమి ఉందని సుమారు 30 మంది రైతులు వరకు ఆ భూమి సంబంధించిందని అన్నారు. లేఅవుట్ యజమానికి మధ్యలో ఉన్న భూమి అడ్డు రావడంతో నమ్మబలికి తమ భూమిని డెవలప్ చేసి 50 శాతం 50 శాతం పంచుకొని అమ్ముకుందామనీ తమను మోసగించి తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని రైతులు వాపోయారు. ఎనిమిదేళ్ల నుంచి రైతులకు డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నాడని చెప్పారు. దీంతో భూమి అమ్మిన రైతులు అప్పలస్వామి, అల్లు అప్పనర్సి వారు చేసిన అప్పులు తీర్చలేక లేఅవుట్ యజమాని డబ్బులు ఇవ్వకపోవడంతో ఇటీవల పురుగుల మందు తాగి చనిపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా లేఔట్ యజమాని రైతులకు ఇవ్వవలసిన సొమ్మును ఇవ్వాలని లేని ఎడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లే అవుట్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిరసన

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి గ్రామ ప్రజలు, నాయకులు, గ్రామ యువత స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర నిరసన వ్యక్తం చేశారు. మంగళపాలెంలో గతంలో రైల్వే గేటు ఉన్నప్పుడే బాగుండేదని కానీ ఈ రైల్వే అండర్ బ్రిడ్జి వచ్చిన తర్వాత నానా అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైల్వే అండర్ గ్రౌండ్ ఆడవాళ్ళకి, వృద్ధులకు, వాహనాలు లేని వాళ్ళకి రోడ్డు మీదకు రావాలంటే కత్తి మీద సాములా ఉందని చెప్పారు. ఈ దారిలో లైట్లు కూడా లేవనీ, రోడ్లు మొత్తం డ్రైనేజీతో నిండిపోవడం వల్ల ప్రయాణాలు సాగిస్తున్న గ్రామస్తులు, వృద్ధులు, ఆడవాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారని మెడికల్ పరంగా అత్యవసర పరిస్థితుల్లో కూడా అంబులెన్స్ గ్రామంలోకి రావడానికి 6 కిలోమీటరలు దూరం పడుతుందని చెప్పారు. విద్యార్థులు కూడా చదువుకోడానికి వెళ్లడానికి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైల్వే అధికారులు స్పందించి ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కొత్తవలస గ్రామస్తులు

ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-రాజాం

ఆహార కల్తీ నియంత్రణ శాఖ సహాయ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి ఆదేశం మేరకు ఆదివారం రాజాం పట్టణం లో ప్రభుత్వ కాలేజీకి ఎదురుగా ఉన్న శ్రీనివాస కాంప్లెక్స్, పోలీసు స్టేషన్ రోడ్డు లో ఉన్న పండ్ల గోడౌన్ లో విజయనగరం జిల్లా ఆహార భద్రత అధికారి పి.వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోల్‌సేల్ గోడౌన్ నుంచి రెండు మామిడి పండ్లు శాంపిల్ తీసుకుని వాటి నాణ్యతను పరిశీలించారు. పక్వం కోసం కృత్రిమ రసాయినాల పరీక్ష నిమిత్తం హైదరాబాద్ లో గల రాష్ట్ర ఆహార ప్రయోగశాల కు పంపినట్లు తెలిపారు

పార్టీని బలోపేతం చేయండి

కార్యకర్తలకు నాగబాబు సూచన

ప్రజాశక్తి-డెంకాడ

జనసేనపార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొనిదెల నాగబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆదివారం భోగాపురంలోని సన్‌రే రిసార్ట్స్‌లో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి అవసరమైన వ్యూహాలు, గ్రాస్‌రూట్ స్థాయిలో నాయకత్వ వికాసం, కార్యకర్తల చొరవను పెంచే మార్గాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి స్థానిక స్థాయిలో పార్టీని బలోపేతం చేసే చర్యలను తక్షణమే చేపట్టాలని అన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ తన నియోజకవర్గ అనుభవాన్ని పంచుకుంటూ, కార్యకర్తల స్థాయిలో పునర్నిర్మాణం ఎలా జరగాలి, స్థానిక సమస్యలను ఎలా గుర్తించి ప్రజల నమ్మకాన్ని సాధించాలి అనే అంశాలపై వివరించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, యువజన నేతలు, మహిళా విభాగం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి; పాల్గొన్న నాగబాబు

'ఉపాధి' ద్వారా పండ్ల తోటల పెంపకం

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లాలో పెద్ద ఎత్తున పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, చిన్న సన్న కార (ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న) రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద వర్షాధారిత, సాగునీటి వసతి ఉన్న వారికి పండ్లతోటల పెంపకంలో భాగంగా జిల్లాలో 23 రకాల పండ్లతోటలు, 2 రకాల పూల తోటలు, మునగ పంటలను రాష్ట్ర ప్రభుత్వం మన జిల్లాలో విస్తతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వర్షాధారిత, సాగునీటి వసతి ఉన్న పండ్లతోటల పెంపకం (వ్యక్తిగత రైతుల పొలంలో) మామిడి, జీడిమామిడి, సీతాఫలం, బత్తాయి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, చింత, దానిమ్మ, అంజూర, పెద్ద రేగు, అవకాడో, పనస, డ్రాగన్ ఫ్రూట్, గులాబి, మల్లె, మునగ, కోకో, జాఫ్రా (సింధూరి), ఆయిల్ పామ్ (పామ్ ఆయిల్), మొదలగు ఉద్యాన పంటలకు సంరక్షణ, నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారని తెలిపారు. పంటలను బట్టి 100 శాతం ఉచితంగా 2 ఏళ్ల నుండి 3 సంవత్సరాల వరకు రైతులకు ఖర్చులను చెల్లిస్తారని తెలిపారు.

గత 2024-2025లో జిల్లాలో 855 ఎకరాలలో వివిధ వర్షాధారిత ఉద్యాన పంటల పెంపకం చేపట్టారని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 2,500 ఎకరాలలో ఉద్యాన పంటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

దరఖాస్తు చేసే విధానం

ఆసక్తి కలిగి, ఉపాధిహామీ జాబ్ కార్డు కలిగి ఉన్న ఎస్.సి, ఎస్.టి చిన్నసన్న కార రైతులు తమ దరఖాస్తులను సంబంధిత మండల కార్యక్రమ అధికారి లేదా ఎంపిడిఒ లేదా ఉపాధి ఎపిఒకు సమర్పించాలి. జిల్లా లోని ఎస్‌సి, ఎస్‌టి, చిన్నసన్నకార రైతులంతా తమ ప్రాంతానికి అనుకూలమైన పంటలను వేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

- భూసారాన్ని బట్టి పంటల ప్రోత్సాహం
- సిద్ధంగా విత్తనాలు, ఎరువులు
- స్వల్పంగా విస్తీర్ణం పెరిగే అవకాశం
- పంటల సాగుకు అనుకూలిస్తున్న వాతావరణం
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విటి రామారావు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఖరీఫ్ పంటల సాగుకు సర్వం సిద్ధం చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. భూ సారాన్ని బట్టి, నీటి వసతులను బట్టి ఏయో పంటలు సాగు చేయాలనే విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. తద్వారా రైతులు నష్టపోకుండా చూసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వరి సహా మిగిలిన పంటలకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నారు పోత, ఉబాలలో అవసరమైన యూరియా, డిఎపి తదితర ఎరువులు తగినంతగా జిల్లాలో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మే నుంచి వర్షాలు కురుస్తున్నందున భూమి చల్లబడిందని, ఈ నేపథ్యంలో సకాలంలో పూర్తయ్యేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. అంతా అనుకూలిస్తే దిగుబడులకు కూడా ఆశాజనకంగా ఉండవచ్చని అంచనా వేశారు. ఈవారం తనను కలిసిన ప్రజాశక్తికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ ఏడాది పంటల విస్తీర్ణం ఎలా ఉండబోతుంది?

గత ఏడాది అన్ని పంటలూ కలుపుకుని 2,88,655 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయి. ఈ ఏడాది మే నుంచే వర్షాలు కురుస్తుండడం, వాతావరణం చల్లబడుతుండడంతో 2,92,483 ఎకరాల్లో పంటల సాగు ఉండవచ్చు. ఇందులో ప్రధానంగా వరి సాగు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది వరి 2,28,145 ఎకరాల్లో సాగయ్యింది. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 2,28,035 ఎకరాలు కాగా, 2,43,625 ఎకరాల వరకు సాగవచ్చని అంచనా. ఈ లెక్కన15,540 ఎకరాల మేర వరి అధికంగా సాగవ్వాల్సివుంది.

మిగిలిన పంటల పరిస్థితి ఏంటి?



మిగిలిన పంటలు కూడా సాధారణ విస్తీర్ణానికి అనుగుణం గానే సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొక్కజొన్న 30,965 ఎకరాల్లోనూ, చెరకు 11,800 ఎకరాల్లోనూ, నువ్వులు 13,962 ఎకరాల్లోనూ సాగవుతాయి. పత్తి 5,355 ఎకరాల్లోనూ, వేరుశనగ 923ఎకరాల్లోనూ, జ్యూట్ 765ఎకరాలు, మినుములు 928 ఎకరాలు, పెసలు 166 ఎకరాలు, పెనలు 28 ఎకరాల్లోనూ సాగు కానున్నాయి.

విత్తనాలు సిద్ధమేనా? ఎన్ని రకాలైన వరి విత్తనాలు ప్రోత్సహిస్తున్నారు ?

భూసారం, నీటి వసతిని బట్టి ఈ ఏడాది జిల్లాలో మొత్తంగా 11రకాల వరి విత్తనాలను ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం 50,010 క్వింటాళ్లు అవసరం కానుంది. ఇందులో ఇప్పటికే జిల్లాలో 40,000 క్వింటాలు సిద్ధంగా ఉన్నాయి. అత్యధికంగా ఎంటియు 1121 రకాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తున్నాం. ఈనేపథ్యంలో ఈ రకం విత్తనాలు 38క్వింటాళ్లు అవసరం కాగా సిద్ధంగా ఉన్నాయి. బిసిటి -3291, బిపిటి 5204 రకాలు రెండో ప్రాధాన్యతలో ఉన్నాయి. ఈ రెండు రకాల విత్తనాలూ 2,500 క్వింటాళ్ల చొప్పున అవసరం కానున్నాయి. మూడో ప్రాధాన్యతలో ఎంటియు-1064, ఎంటియు 7029 రకాలు ఉన్నాయి. ఇందులో ఎంటియు -1064 రకానికి 2,200 క్వింటాళ్లు, ఎంటియు 7029 రకానికి 2000 క్వింటాళ్లు, ఎంటియు -1224 రకం 1650క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్ 34449 రకం 50 క్వింటాళు జిఎస్ఆర్ -2587 రకం 200క్వింటాళు ,,ఆర్ఎస్ఎ.ఎల్ 15048 రకం 50క్వింటాళ్లు చొప్పన అవసరం. ఇందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాం. విత్తనాలకు ఢోకాలేదు. రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి?

ఈ ఏడాది మే నెల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూమి పూర్తిగా చల్లబడింది. ఇప్పటికే పొడి దిక్కులు దాదాపు పూర్తయ్యాయి. ఎక్కువ చోట్ల నారు మడులు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు, ముఖ్యంగా సకాలంలో అవుతాయని ఆశిస్తున్నాము. అలాగే దిగుబడి కూడా తగినంతగా వస్తుందని ఆశాభావం ఉంది.

నిరసన కారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం : ఎమ్మెల్యే

శృంగవరపుకోట: జిందాల్ కర్మాగారం కోసం భూములు ఇచ్చిన రైతులకు గ్రామసభల ద్వారా న్యాయం జరిగే విధంగా చూస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. జిందాల్ భూముల వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులను ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కలిసారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. 2007లో జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీకి అతి తక్కువ ధరకు భూములు ఇచ్చామని, పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యం చెప్పిందన్నారు. నేటికీ సుమారు 17 సంవత్సరాల గడిచిన ఎటువంటి ఫ్యాక్టరీ పెట్టకపోగా భూములను ప్రైవేట్ వ్యక్తులకు అధిక ధరకు అమ్ముకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, భూమి ఇచ్చిన తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిందాల్ కంపెనీకి భూమిలిచ్చిన భూ నిర్వాసితులందరికి న్యాయం చేస్తామని త్వరలో గ్రామాలలో అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా నిజమైన భూ నిర్వాసితులను గుర్తించి వారందరిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని అన్నారు. మన ప్రాంతానికి కంపెనీలు వస్తే మన పిల్లల భవిష్యత్తులు బాగుపడతాయని అందుకుగాను మీరందరూ సహకరించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, ఆడారి మహేష్, శివ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 437 మంది హాజరు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన జాబ్ మేళాకు 437మంది హాజరయ్యారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలలో ప్లేస్మెంట్ అధికారి భాస్కర్ మాటాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకి 437 మంది అభ్యర్థులు హాజరవ్వగా వీరిలో పలు కంపెనీలకు 162 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. మరొక 53 మంది తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ జాబ్‌మేళాకు 13 బహుళ జాతి కంపనీలు పాల్గొన్నాయని ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10వేలు నుంచి రూ. 25వేలు వరకూ ఉంటుందని చెప్పారు. ఈ జాబ్ మేళాలో ముఖ్య అతిథులుగా జిల్లా నైపుణ్యాధికారి జి. ప్రశాంత్ కుమార్, ప్లేస్మెంట్ అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ సురేష్ 55 మంది కంటి రోగులకు పరీక్షలు జరపగా, 31 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. వీరిని బస్ ద్వారా తీసుకొని వెళ్ళి ఆపరేషన్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి కార్యదర్శి రేవంత్, క్యాంప్ సమన్వయకర్త వెంకటరమణ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని మారిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధురువాడకు చెందిన శివ చత్రపతి కలాం జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఎం.సురేష్ కుమార్ రూ.11,500 విలువ గల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ప్లాంక్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడి రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన జన్మదినం సందర్భంగా కోటలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువతకు పిలుపునిచ్చారు.

వేల గొంతులు ఒక్కటై నిరసన తెలపాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

విద్యార్థులు, నిరుద్యోగ యువత ఏకమై వేలాది గొంతులతో తమ నిరసన గలాన్ని కూటమి ప్రభుత్వానికి వినబడేట్లు తెలపాలని వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరగనున్న నిరసన కార్యక్రమానికి వేలాది సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై పోరుబాట పేరుతో యువత పోరాటం చేయడానికి సిద్ధం కావాలన్నారు.

కళాశాలల జిల్లా గ్రంథాలయ కమిటీ కన్వీనర్‌గా రామభద్రరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళాశాలల జిల్లా గ్రంథాలయ కమిటీ కన్వీనర్ గా బుద్ధరాజు రామభద్రరాజు ను నియమిస్తూ ఆదివారం జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె. దయానంద్ సంఘ కార్యాలయంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 34 ఏళ్ళ పాటు గ్రంథాలయ అధికారిగా, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పనిచేసిన రామభద్రరాజు జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసారని అన్నారు. వీరి ఆధ్వర్యంలో కళాశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల్లో పుస్తకపఠనం పెంపొందిస్తూ, గ్రంథాలయాల కార్యక్రమాలను ప్రోత్సాహించడం జరుగుతుందని, ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రామభద్రరాజుకు గ్రంథాలయ సంఘం సభ్యులు పలువురు అభినందనలు తెలిపారు.

సేవ చేసే వారిని అభినందించాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కనపాక పరిధిలో గత 12 సంవత్సరాలుగా జరుగుతున్న మాతా బుజ్జి క్రికెట్ టోర్నమెంట్ , పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 582 మార్కులు సాధించిన గాజుల జ్ఞాన హర్శినిని ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్ వినర్స్‌గా కింగ్ కోహ్లీ రాయల్స్ టిఆర్ కాలనీ టీం గెలుచుకుంది. విజేతలకు ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు చేతుల మీదుగా అశోక్ బంగ్లాలో బహుమతులను ప్రదానం చేశారు.. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు మాతా బుజ్జి, భీమునిపట్నం సుకన్య ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి మంచిదని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎఎంసి చైరకర్రోతు వెంకట నరసింగరావు, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన

-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-

గరివిడి, జామి, కొత్తవలస రూరల్, జియ్యమ్మవలస, సాలూరు, పార్వతీపురం రూరల్, బలిజిపేట రూరల్

ఇంటర్వ్యూ : తేది: 04-07-2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు :

9490099164, 9490099156, 8331011960

ప్రజాశక్తి కార్యాలయం

అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

లక్ష్మీపేట దళితులకు న్యాయం జరిగేనా..?

◆బాధితులకు ఇస్తామన్న భూమి ఏదీ? ◆మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామన్న హామీ ఏమైనట్టు ?◆13 ఏళ్లుగా ఎస్‌సిలకు తప్పని నిరీక్షణ

జాతీయ స్థాయిలో సంచలనం రేపిన లక్ష్మీపేట ఘటన తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. ఐదుగురు దళితులను పెత్తందారులు హత్య చేసి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకూ వారికి న్యాయం జరగలేదు. బాధితులకు ఇస్తామన్న భూమి ఇవ్వలేదు. మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామన్న హామీ కూడా నెరవేరలేదు. దళిత బాధితులకు ఆనాడు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఏ ప్రభుత్వమూ ముందుకు సాగలేదు. ప్రత్యేక కోర్టులో విచారణ పేరుతో ఇంత వరకు కాలయాపన జరిగింది. ప్రస్తుతం మాత్రం విచారణ వేగవంతం చేస్తాం అందరూ హాజరుకావాలని ఆదేశించడంతో తాము కోరుకున్న పిపి లేకుండా విచారణ వేగవంతం చేస్తే తమకు ఎలా న్యాయం జరుగుతుందని బాధిత దళితులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చట్ట ప్రకారంగా బాధితులు కోరుకున్న పూర్తిస్థాయి పిపిని నియమించి విచారణ వేగవంతం చేయాలని దళిత బాధితులు, సాక్షులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి- వంగర

మండలంలోని లక్ష్మీపేటలోని 5 గురు దళిత మాల కులస్తులను పెత్తందారులు 2012 జూన్ 12న మరణాయుధాలతో దాడి చేసి చంపేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను తలుచుకుంటూ అక్కడ బాధిత దళితులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. తమకు ఎప్పుడు న్యాయం జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు.

ప్రత్యేక కోర్టులో కనిపించని పురోగతి

లక్ష్మీపేట ఘటన జరిగిన తర్వాత దళిత, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేయడంతో లక్ష్మీపేటలో ప్రత్యేక కోర్టు 2014లో ఏర్పాటు చేశారు. ఈ కోర్టులో పూర్తిస్థాయి న్యాయమూర్తి జడ్జితో పాటు దళిత బాధితులు కోరుకున్న పిపి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించి త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయవలసి ఉంది. అయితే ఈ కోర్టులో కొన్నాళ్ళు ఇన్చార్జి జడ్జీలతో కొనసాగింది. దళిత బాధితులు కూడా పిపిని ఇప్పటివరకు ఆయన వ్యక్తిగత కారణాల వల్ల కోర్టుకు తెలిపి ఇక్కడ నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి బాధితులు తరఫున కోర్టులో వాదించేందుకు పిపి లేకపోవడంతో విచారణ పూర్తికాక కాలయాపన జరిగింది. బాధితులు మాత్రం న్యాయం ఎప్పుడు జరుగుతుందా అని ఎదురుచూస్తున్న పరిస్థితి దాపురించింది.

పిపిని నియమించి విచారణ వేగవంతం చేయండి

లక్ష్మీపేట ప్రత్యేక కోర్టులో ఉన్న ప్రస్తుత పూర్తిస్థాయి న్యాయమూర్తి విచారణ వేగవంతం చేస్తూ అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించడంతో తమకు ప్రస్తుతం ఉన్న పిపి తమ సమస్యలు కోర్టుకు తెలియజేసే పరిస్థితి లేదని, తాము కోరుకున్న పిపిని నియమిస్తే ప్రత్యేక కోర్టుకు హాజరై తమ మొర చెప్పుకున్నామని లేదంటే తమ సమస్యను ఎవరికి చెప్పుకోలేమని పిపిని నియమించే వరకు తమకు అవకాశం కల్పించాలని బాధిత దళితులు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా ఉన్నతాధికారులకు కూడా తమ సమస్యను విన్నవించారు. ఈ మేరకు హైకోర్టు ఈనెల 23 వరకు అవకాశం కల్పించింది. ఈ నెల 24 నుంచి లక్ష్మీపేట ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరుకావాలని తొందర పెడుతున్న పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉన్న కోర్టు జడ్జి కూడా నిందితులకు అనుకూలంగా బాధితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇదే విషయంపై దళిత సంఘాలు కూడా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దళిత బాధితులు మాత్రం తమ కోరుకున్న పిపి లేకుండా కోర్టుకు వెళ్లి తమ సమస్యను ఎవరితో చెప్పుకోవాలి? తమకు ఏం న్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి పిపిని నియమించాలని బాధిత దళితులు కోరుతున్నారు.

లక్ష్మీపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ స్థానం

రసాయన వ్యర్థాలతో రోగాలు

●ఇథనాల్ ప్లాంట్ నుంచి చెరువులోకి వ్యర్థాలు● రోగాల బారిన పడుతున్న మూగజీవాలు● సర్పంచ్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని యాజమాన్యం

ప్రజాశక్తి- రేగిడి

సంకిలిలో ఇఐడి ప్యారి చక్కెర కర్మాగార అనుబంధ సంస్థ ఇథనాలు ప్లాంట్ నుంచి వెలువడుతున్న కలుషిత వ్యర్థ పదార్థాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యర్థ రసాయన పదార్థాలు ముందుగా సంకిలిలో ప్రభుత్వ నాయిని చెరువుకు యాజమాన్య సిబ్బంది వదలడంతో ఆ చెరువు నుంచి పిల్ల మధుములు ద్వారా పంట పొలాలకు, దేవుదల గ్రామంలోని చెరువులకు, తాగునీటి బావుల్లోకి చేరి ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. కలుషితమైన వ్యర్థ రసాయనిక పదార్థాల కారణంగా చెరువుల్లో మూగజీవాలు నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నాయి. ఈ వ్యర్థ రసాయనక పదార్థాలు కారణంగా జీవకోటి ప్రాణాలతో పాటు పచ్చటి పైర్లు భూసారం పోయి, ఏడాదికి మూడు పంటలు పండించే వ్యవసాయ భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నపాటి కొద్ది వ్యవసాయం చేసిన పంటలు పండక, దిగుబడులు రాక అప్పుల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇక కౌలు రైతులు విషయానికొస్తే భూ యజమాని వద్ద ఎకరానికి 12 ధాన్యం బస్తాలు, 10కుంచాల అపరాల పంటైన మినుము ఇస్తామని కౌలుకి రాసుకుంటే కలుషిత రసాయనిక వ్యర్థ పదార్థాల కారణంగా పంటలు పోయి నష్టాల బాటలో పడి భూ యజమానికి ఫల సాయం ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంపై గ్రామస్తులు, సర్పంచ్ కుప్పిలి దుర్గా గవరయ్య ఎన్నోసార్లు యాజమాన్య సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకునే దాఖలాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సంకిలి గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు సంకిలి నాయిని చెరువు, చిన్నయ్య పేట అవుట్ చెరువుల్లోకి కలుషిత రసాయనిక వ్యర్థ పదార్థాలు వదలడం కారణంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన కర్మగార యాజమాన్యం వారితో మమేకమై తూతూ మంత్రంగా పరిశీలన చేశారే తప్ప, కలుషిత వ్యర్థ పదార్థాల రసాయనాలు ఎంత కలిశాయో శాంపిల్స్ తీసుకు వెళ్లడమే తప్ప ఎంత శాతం రసాయనకి వ్యర్థ పదార్థాలు కలిసాయో. లేదో ఫిర్యాదుదారులకు, గ్రామస్తులకు తెలపని పరిస్థితి నెలకొంది. ఇలా పొల్యూషన్ అధికారుల చేయి తడపడమే దీనికి కారణమా అంటూ ఆయా గ్రామాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కలుషిత రసాయనిక వ్యర్థ పదార్థాలు ప్రభుత్వ చెరువుల్లో కలిసిన విషయాన్ని విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

దేవుదళ చెరువులో కలిసి పోతున్న కలుషిత నీరు

వ్యర్థ పదార్థాలతో రోగాలు

సంకిలి షుగర్ ఫ్యాక్టరీ అనుబంధ సంస్థ ఇథనాల్ ప్లాంట్ నుంచి కలుషిత రసాయనిక వ్యర్థ పదార్థాలు కారణంగా ప్రభుత్వ చెరువుల్లోకి నీరు వదులుతున్నారు. ఆ నీరు మూగజీవాలు తాగి రోగాల బారిన పడుతున్నాయి. దేవుదళ తాగునీటి బావుల్లోకి చేరి ప్రజల రోగాలు బారిన పడుతున్నారు. ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. అధికారులు యాజమాన్య సిబ్బందికి కొమ్ముకాస్తున్నారు.

సర్పంచ్ దుర్గ గవరయ్య, దేవుదల

ఖానాలో నుంచి వెళ్తున్న వ్యర్థ పదార్థాలు

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో సోమవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఎఇ రవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు, లైన్ల విభజనలో భాగంగా సోమవారం పట్టణంలోని రాంనగర్, ఏవి హెూమ్స్, పందిరప్పన్న జంక్షన్, ఎస్ కోట సబ్‌స్టేషన్ ఏరియా, మయూర ఇన్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పట్టణ వాసులు సహకరించాలని ఆయన కోరారు.

రామకృష్ణకు జ్ఞాపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి ఆరోగ్యం, పచ్చదనం పెంపునకు కృషి చేసిన బి.రామకృష్ణ అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలలో భారత ప్రభుత్వ యువజన, క్రీడలు మంత్రిత్వశాఖ వారు మై భారత్ గెస్ట్ ఆఫ్ ఆనర్ జ్ఞాపికను బహుకరించారని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, పి.చలపతి రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, యన్‌యస్‌యస్ ప్రోగ్రాం అధికార్లు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, యమ్.అనిత కుమారి, కె.బాలరాజు, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ లక్ష్మి, ఉన్నారని అన్నారు.

డాక్-2025 సదస్సుకు సెంచూరియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో జరుగుతున్న 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డాక్) సదస్సుకు భారత్ నుంచి సెంచూరియన్ విశ్వవిద్యాలయం తరఫున ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖరదాస్, లక్ష్మికాంత్ సుతార్ పాల్గొంటున్నారు. ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో చిప్స్‌టు సిస్టమ్స్ అనే అంశంపై ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీమెన్స్, చిప్ ఏజంట్స్ ఏ1, సినాప్సిస్, కీసైట్, ఎన్సిస్, కాడెన్స్, రాకెట్ సాఫ్ట్ వేర్ వంటి దిగ్గజాలు తమ తాజా ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై మన సామర్థ్యాలను పరిచయం చేయడానికి భారత్ నుండి ప్రథమ విశ్వవిద్యాలయంగా నిలిచినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా మన పరిశోధన, ఆవిష్కరణల పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తున్నామన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ పరిశ్రమలతో సంబంధాన్ని బలోపేతం చేసేందుకు ప్రముఖ సెమికండక్టర్ డిజైన్ సంస్థ మార్కీ సెమికండక్టర్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుందన్నారు. ఈ సహకారం ద్వారా విద్యార్థులకు ఆధునిక టూల్స్ మీద అనుభవం కల్పించడంతో పాటు, సెమికండక్టర్ టెక్నాలజీలో శిక్షణను మరింత బలోపేతం చేయనుందన్నారు. ఈ వేదికపై వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ తన ఆవిష్కరణలకు విశ్వవ్యాప్త గుర్తింపు పొందడానికి, అధ్యాపకులు, విద్యార్థులకు ప్రపంచ స్థాయి పరిశోధన వాతావరణాన్ని కల్పించడానికి ముందడుగు వేస్తోందన్నారు. 50 పైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యంలో ఈ విశ్వవిద్యాలయం గ్లోబల్ స్థాయిలో పోటీపడగల విద్యా ప్రణాళికలను అందిస్తోందన్నారు.

సంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో మోడీ ప్రభుత్వం తక్షణమే అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం డాబా తోట కళాసి కార్మికులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న జాతీయ సమ్మె జరుగుతోందని, జిల్లాలో కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాల చట్టం సవరణ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు, అధిక ధరలు తగ్గించాలని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . కార్యక్రమంలో గోవింద, రమణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

రక్తదాతలకు వేదిక మాతృభూమి సేవాసంఘం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో యువతకు రక్తదానంపై చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూనే రక్తదాతలకు ఒక వేదికను తయారు చెయ్యడంలో మాతృభూమి సేవాసంఘం కీలకపాత్ర పోసించిందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మాతృభూమి సేవాసంఘం వ్యవస్థాపకుడు ఇప్పలవలస గోపాలరావు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం గురజాడ గ్రంధాలయం లోని చాసో భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా, హెచ్ఐవి బాధితులకు, రోడ్డు ప్రమాదంలో ఉన్నవారికి,అత్యవసర ఆపరేషన్ లకు ఇప్పలవలస గోపాలరావు వెంటనే స్పందించి రక్తం అందేటట్లు ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు,అబ్దుల్ కలామ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు మమ్ముల తిరుపతి రావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అండగా ఉండాలని గోపాలరావు పుట్టినరోజు సందర్భంగా సుమారు 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చెయ్యడం గొప్ప విషయమని అభినందించారు, సమావేశంలో ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శర్మ, విశ్రాంత చీఫ్ బ్యాంకింగ్ అధికారి పిడకల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న బీశెట్టి బాబ్జి తదితరులు

రేవంత్‌కు సత్కారం

గజపతినగరం: సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న రక్తదాన కార్యక్రమాలకు ఆదివారం సత్కారం జరిగింది. మాతృభూమి సేవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ద్వారా చేస్తున్న సేవలకు గాను లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ చేతుల మీదుగా సహాయ స్ఫూర్తి కార్యదర్శి రేవంత్‌కు మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల బిజెపి ఇంచార్జ్ బుర్లి శ్రీధర్, మాతృభూమి సేవ సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సాధన దుర్గా ప్రసాద్‌కి సత్కారం

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాదరావుకి సత్కారం జరిగింది. ఆదివారం విజయనగరం మాతృభూమి సేవ సంఘం కార్యదర్శి గోపాలరావు పుట్టినరోజు సందర్భంగా విజయనగరం గురజాడ లైబ్రరీలో ముఖ్య అతిథిగా భీశెట్టి బాబ్జి, అబ్దుల్ కలాం సేవ సమితి మామూలు తిరుపతిరావు, నెల్లిమర్ల బీజేపీ నియోజకవర్గం ఇంచార్జ్ బూర్లే శ్రీధర్ సమక్షంలో రక్తదాన శిబిరాలు, 66వ సారి రక్తదానం చేసినందుకు దుర్గా ప్రసాద్ సత్కరించారు.

బస్సులో పోగొట్టుకున్న నగదు అందజేత

ప్రజాశక్తి - రామభద్రపురం

వైజాగ్ నుంచి రామభద్రపురం వస్తున్న ఒక కుటుంబం బస్సులో పోగొట్టుకున్న నగదు తిరిగి వారికి అందజేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. సాలూరు డిపోకు చెందిన బస్సులో వైజాగ్‌లో ఒక కుటుంబం రామభద్రపురం వచ్చేందుకు ఎక్కారు. టికెట్ తీసుకున్న తరువాత భర్త తన భార్యకు రూ.4,600తో పర్సు ఇచ్చి భద్ర పరచమని చెప్పాడు. ఆమె చుడీదార్ జేబులో పెట్టుకుందామని ప్రయత్నించి అశ్రద్ధగా జేబులో పెట్టబోయి కింద పడేయడంతో బస్సులో పర్సు సీటు కింద పడిపోయింది. బస్సు దిగిన తరువాత ఇది గమనిం చని వారు డబ్బులు పోయినట్లు కనుగొని స్థానిక కాంప్లెక్ వద్ద ఆర్టీసీ పార్సెల్ కౌంటర్ ఏజెంట్ నల్ల భాస్కరరావుకు విషయం చెప్పారు. ఆయన వెంటనే స్పందించి వారి టిక్కెట్ ఆధారంగా ఆ బస్సు కండక్టర్‌ను గుర్తించి ఫోన్ చేసి వారి సీటు వద్ద పరిశీలించగా వారి నగదుతో ఉన్న పర్సు దొరికింది. వెంటనే వారికి నగదుతో ఉన్న పర్సు అందజేశారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించి స్పందించిన భాస్కరరావుకు ఆ ప్రయాణీకులు కృతజ్ఞత తెలిపి వారి సమక్షంలో పోగొట్టుకున్న నగదు తీసుకున్నారు.

బాధితురాలికి నగదు అందిస్తున్న భాస్కరరావు

ఉమ్మి తడి పనులేనా?

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రానికి ఉన్న ప్రధాన రహదారి విస్తరణ పనులు మధ్యలో ఆగిపోయి నేటికి సుమారు నాలుగు సంవత్సరాలు దాటి పోవడంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై విపరీతమైన గోతులు పడడంతో ప్రయాణం సాగించడానికి పడుతున్న బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. గత ప్రభుత్వ అశ్రద్ధ వల్ల ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగి సుమారు ఐదు కిలోమీటర్ల వరకు భారీగా గోతులు పడ్డాయి. ప్రస్తుతం ఆ గోతుల్లో క్వారీ మెటల్ వేసి ఉమ్మితడి పనులు చేస్తున్నారే తప్ప శాశ్వతంగా ఆగిపోయిన విస్తరణ పనులు ఎందుకు చేపట్టడం లేదంటూ ప్రజలు వాదిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టి మండల ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

తాత్కాలికంగా వేసిన మెటల్

IN THE HONOURABLE COURT OF THE DISTRICT JUDGE AT VIZIANAGARAM. O.S.No 2/2020.

Between:
Sri Raj Kumar Agarwala ....Plaintiff.
And:
Sri Kalagarla Rambabu and others. .....Defendants.

To

THE DEFENDANTS No 10 AND 13

DEFENDANT NO 10 : Sri Hari Singh S/o Rattan Singh, Hindu, aged about 59 Years, Resident of D/No 50-27-17/1, TPT Colony, Seethammadara, Visakhapatnam.

DEFENDANT NO 13 : Sri Mudunuru Sanyasi Raju S/o Suryanarayana Raju, Hindu, aged about 45 Years, resident of Plot No 7, Shiridi Colony, Thotapalem, Vizianagaram.

Please take notice that the above named Plaintiff instituted the above matter against you. Further, along with the said suit, the plaintiff also filed I.A.No 4/2020 for temporary injunction against you. The said suit and the said interim application stands posted to **2nd day of July 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM. I.A.No 108/2023 in O.S.No 113/2017.

Between:
Sri Kapuganti Venkata Ramana @ Yedukondalu ....Petitioner/Plaintiff.
And:
1. Sri Kanakala Bangarayya,
2. Sri Kanakala Satyanarayana
3. Sri Kanakala Ganesh
4. Sri Kanakala Nagaraju
.....Respondents/Defendants.
5. Smt Kanakala Bangaramma
6. Smt Chelluri Sanyasamma
7. Smt Meesala Appalanarasamma
8. Smt Bugatha Bhagyam
9. Smt Boni Bangaram
.....Proposed Defendants No 5 to 9.

PROPOSED 6TH DEFENDANT

Smt Chelluri Sanyasamma W/o Ramana, Hindu, aged about 39 Years, residing near Akula Depot, Near Muntaj Hotel, S.Kota, S.Kota Mandal, Vizianagaram District.

Please take notice that the above named Plaintiff instituted the above suit against the Defendants No 1 to 4. While so, the first defendant died and as such, the plaintiff filed the above I.A praying the Honourable Court may be pleased to implead you as 6th Defendant in the aforesaid suit. The aforesaid Honourable Court is pleased to post the said I.A to **11th day of July 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M.. failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.